క్లుప్తంగా

విద్యుత్ టవర్ నిర్మాణం పూర్తి



కోటిపల్లిలో కొత్తగా నిర్మించిన టవర్

అమలాపురం రూరల్: ఈనెల 15న కోటిపల్లి- కె గంగవరం 132 కేవీ లైన్ టవర్ కుప్పకూలి పోయిన కారణంగా మూడు రోజులుగా కోనసీమ వ్యాప్తంగా విద్యుత్ కష్టాలను ఎదుర్కొన్న ప్రజలకు శుక్రవారం నుంచి ఉపశమనం కలిగింది. టవర్ కూలినప్పటి నుంచి పగలు ఎలా ఉన్నా రాత్రి వచ్చేసరికి కరెంట్ లేక ప్రజలు అల్లాడిపోయేవారు. ప్రత్యా మ్నాయ మార్గంలో భీమవరం జిల్లా ఉండి నుంచి విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా చేసేవారు. దీనివల్ల రాత్రి సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండేది. టవర్ కూలిన ప్రాంతంలోని కోటిపల్లి వద్ద నూతన టవర్ నిర్మించేందుకు ఏపీఈపీడీసీఎల్ కోనసీమ జిల్లా ఎస్ఈ సిద్దల రాజబాబు పర్యవేక్షణలో అమలాపురం. రామచంద్రపురం ఈఈ రాంబాబు, రత్నలరాజు, డీఈఈ శ్యామ్‌బాబు యుద్ధప్రాతిపదికన ప్రత్యేక సిబ్బంది అహర్నిశలు శ్రమించారు.శుక్రవారం అర్ధరాత్రి టవర్ నిర్మాణం పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 7.10 గంటల నుంచి రామచంద్రపురం నుంచి కోనసీమకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేశారు.

డ్రై డే పాటించాలి

అల్లవరం: ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని మురుగు నీరు నిల్వ లేకుండా డ్రై డే పాటించాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. బెండమూర్లంకలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తే వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్న దోమల నివారణ సాధ్యమని వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది, స్థానిక మహిళలతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ అధికారి ఎన్‌వీ రమణ, సిబ్బంది ఎస్‌వీఎస్ ప్రసాదు, ఎస్ఎల్‌వీ రంగనాథ్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద గురువారం రాత్రి కోరంగి పోలీసులు నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసారు. ఈ సందర్భంగా ఎస్సై పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భద్రత దృష్ట్యా రహదారిని తమ ఆధీనంలోకి తీసుకుని నాకాబందీ నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నర్సులకు నియామక పత్రాల అందజేత

యానాం: వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న 14 మంది నర్సులకు శుక్రవారం సీఎం రంగసామి నియామక పత్రాలను అందజేశారు. మార్చి 2024లో పుదుచ్చేరి, యానాం, మహే, కారైకల్ రీజియన్లలో నర్సింగ్ పోస్టుల నియామకాలకు ఆరోగ్యశాఖ అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసింది. 133 మంది నర్సులకు నియామక పత్రాలను అప్పట్లోనే అందజేశారు. కొన్ని సాంకేతిక కారణాలతో 14 మందికి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. దీంతో సీఎం రంగసామి సమస్యపై స్పందించి మిగిలిన వారికి అసెంబ్లీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియామక ఉత్తర్వులు అందించారు. స్పీకర్ సెల్వం, పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ, హెల్త్ డైరెక్టర్ రవిచంద్రన్ పాల్గొన్నారు.

స్నేహితుడి ఇంట సినీ నటుడు మహేష్ సందడి



అమలాపురంలో సినీ నటుడు మహేష్‌తో కౌన్సిలర్లు, అభిమానులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం 28వ వార్డు కౌన్సిలర్ గోపి రాజీ రమేష్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్న సినీ నటుడు ఆచంట మహేష్ స్థానిక దుడ్డి వారి అగ్రహారంలోని ఆ కౌన్సిలర్ ఇంట శుక్రవారం సందడి చేశారు. పలువురి మున్సిపల్ కౌన్సిలర్లు, స్నేహితులతో కలిసి నటుడు మహేష్ ముచ్చటించారు. కౌన్సిలర్ బండారు గోవిందు, వైఎస్సార్ సీపీ నాయకులు రాజీ రమేష్, దొంగ చిన్నా, రాజీ వంశీ, అమలాపురం టౌన్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షుడు పోలిశెట్టి రాము, వీరిన చిన్న తదితరులు సినీ నటుడు మహేష్‌ను కలిసారు. ఇదే సందర్భంగా మహేష్ తన పుట్టిన రోజు వేడుకను స్నేహితులు, అభిమానుల మధ్య జరుపుకున్నారు. ఆయనతో స్నేహితులు పుట్టిన రోజు కేక్ కట్ చేయించి ఘనంగా సత్కరించారు.

వంతెన నిర్మాణానికి మార్గం సుగమం

- ఆక్రమణల తొలగింపు ముమ్మరం
- ఈదరపల్లి వంతెనకు మోక్షం



ఈదరపల్లి వంతెన



నూతన వంతెన నిర్మించనున్న ప్రాంతంలో తొలగించిన ఆక్రమణలు

అమలాపురం రూరల్: జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించే దిశగా ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో ఈదరపల్లిలో నూతన వంతెన నిర్మాణానికి మోక్షం కలగనుంది. ఈదరపల్లి వద్ద నూతన వంతెన నిర్మాణానికి వంతెనకు ఇరువైపులా ఆక్రమణలను అధికారులు తొలగింపు చేపట్టడంతో కొత్త వంతెన నిర్మాణానికి మార్గం సుగమం కానుంది. ఈదరపల్లి వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ జఠిలమవుతోంది.

రూ.2 కోట్ల మంజూరు

కలెక్టర్ రూ.2 కోట్లు మంజూరు చేయడంతో వంతెన నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. నూతనంగా ఏర్పడిన అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు కేంద్రంగా ఉన్న అమలాపురంలో పురాతనమైన వంతెనలు ఉండటంతో జిల్లా కేంద్రం స్థాయికి, ట్రాఫిక్ రద్దీకి తగ్గట్టుగా అవిలేవు. శిథిలావస్థకు చేరుకున్న ఈదరపల్లి వంతెనపై నిత్యం ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది. 60 ఏళ్ల క్రితం ఈ వంతెన నిర్మించారు. వంతెనపై వేలాది వాహనాలు రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. ఫుట్‌పాత్ పూర్తిగా కూలిపోయింది. వంతెన రెయిలింగ్ దెబ్బతింది. ఫుట్‌పాత్‌పై ప్రజలు నడిచి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు.

ఈదరపల్లి నుంచి బండారులంక వరకూ ఆక్రమణల తొలగింపు

వంతెన వద్ద ఆక్రమణల తొలగింపునకు ఆర్డీఓ కే మాధవి, రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాము, జలవనరుల శాఖ డీఈ బి.శ్రీనివాసరావు ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు, పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్, సర్పంచ్‌తో ఒక కమిటీ వేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేత పనులు ప్రారంభించారు. తహసీల్దార్ అశోక్ ప్రసాద్, ఆర్ఐ సాధనాల ఎల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈదరపల్లి వంతెన నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రోడ్డుకు ఇరువైపులా కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి కొంతమంది భారీ భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. దీంతో ప్రతిరోజు ఈదరపల్లి వంతె వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతోంది. ఈదరపల్లి బ్రిడ్జి నుంచి లారీ యూనియన్ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. వంతెన ఇరువైపులా 50 అడుగుల మేర బండారులంక వరకు ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు తెలిపారు. కొందరు ఆక్రమణదారులు, పక్కా భవనాలు యాజమానులు అధికారుల హెచ్చరికతో వాటిని స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు

అమలాపురంలో మూడు వంతెన నిర్మాణంలో భాగంగా ఈదరపల్లిలో నూతన వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వంలో అప్పటి రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కేంద్ర రవాణశాఖ మంత్రితో మాట్లాడి సీఆర్ఐ నిధులు రూ.2కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. అల్లవరం మండలం కొమ్మరగిరిపట్నం- సామంత్రకుర్రు ఆర్అండ్‌బీ రోడ్డుతో పాటు ఈదరపల్లి వంతెనకు ఒక ప్యాకేజీగా నిధులు కేటాయించారు. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో జీవో విడుదలకు ఆటంకం ఏర్పడింది. తాజాగా కలెక్టర్ స్పందించి నిధులు విడుదల చేయడంతో ఆక్రమణలు తొలగింపు అనంతరం ప్రస్తుతం వంతెన పక్కన కొత్త వంతెన నిర్మాణం చేపట్టానున్నారు. అమలాపురం నల్లవంతెన బైపాస్ రోడ్డు వైపు కొత్త వంతెన నిర్మించనున్నారు. పాత వంతెన మాదిరిగానే 9 మీటర్ల వెడల్పు 12 మీటర్ల పొడవున వంతెన నిర్మాణ చేపట్టేందుకు ఆర్అండ్‌బీ శాఖ అంచనాలు సిద్ధం చేసింది

డీఆర్‌డీఏ భవనం తొలగింపు

అమలాపురం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న డీఆర్డీఏ శాఖకు పాత భవనంలో నాలుగు షాపులను అద్దెకు తీసుకుని కొంతమంది వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. భవనంలో షాపులను ఖాళీ చేయాలని అధికారులు వ్యాపారులకు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా వారు పట్టించుకోవడంలేదు. సక్రమంగా అద్దెలు చెల్లించడం లేదు. దీంతో ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ఆ నాలుగు షాపులను జేసీబీతో అధికారులు తొలగించారు.

జగ్గిరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకుల ఘన సత్కారం



జగ్గిరెడ్డిని కలసిన శ్రీకాంత్, బాపూజీ తదితరులు



జగ్గిరెడ్డిని కలిసి అభినందనలు తెలుపుతున్న డాక్టర్ శ్రీకాంత్, అమలాపురం నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత పటిష్టమవుతుందని అమలాపురం నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్, మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆకాంక్షించారు. జగ్గిరెడ్డి స్వగ్రామం రావులపాలెం మండలం గోపాలపురానికి అమలాపురం నియోజకర్గం నుంచి డాక్టర్ శ్రీకాంత్‌తో పాటు పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు శుక్రవారం వెళ్లి ఆయనను స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్, నాయకులు పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించి అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అమలాపురం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, అల్లవరం మండలాల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవి, కొనుకు బాపూజీ, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు కట్టోజు సన్నయ్యదాసు, కొల్లాటి దుర్గాబాయి, పార్టీ నాయకులు ఉండ్రు వెంకటేష్, చొల్లంగి సుబ్బిరామ్ తదితరులు జగ్గిరెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

జగ్గిరెడ్డిని కలిసిన అల్లవరం శ్రేణులు

అల్లవరం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన చిర్ల జగ్గిరెడ్డిని అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో అల్లవరం మండల పార్టీ శ్రేణులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, యువజన విభాగ అధ్యక్షులు బళ్ల శ్యామ్, పార్టీ నాయకులు పులుసుగంటి గంగాధర్, కంపాని రాజేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అవినీతిపై చార్జిషీట్

యానాం: పుదుచ్చేరిలో నాలుగున్నర ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై చార్జిషీట్ సిద్ధం చేస్తున్నట్లు ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు వైథిలింగం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చార్జిషీట్‌ను సిద్ధం చేయడానికి 22 మంది సభ్యుల ప్యానెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ అవినీతి ఆరోపణలు, వైఫల్యాలను ఈ కమిటీ పరిశీలిస్తుందన్నారు. అఖిల భారత కమిటీ ఆమోదంతో ఏర్పాటైన ఈ ప్యానల్ పాలకవర్గానికి వ్యతిరేకంగా వివరాణాత్మక నివేదికను రూపొందిస్తుందన్నారు.

ప్రతి కార్యకర్తకూ అందుబాటులో ఉంటా



వానపల్లిపాలెంలో టీడీపీ కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీకాంత్



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యనాగేంద్రమణి తదితరులు

ఉప్పలగుప్తం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో బాధ్యత గల పదవి అప్పచెప్పటంతో ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. వానపల్లిపాలెంలో శుక్రవారం కార్యకర్తలతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. శ్రీకాంత్‌ను పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన కార్యకర్త దోనిపాటి మీరయ్య మరో పది మంది సభ్యులు శ్రీకాంత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని పార్టీ కండువా కప్పి శ్రీకాంత్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లా నాయుడు, నల్లా సూర్యప్రకాష్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చీకట్ల కిషోర్, మోటూరి సత్యంకాపు, నల్లా శ్రీను, మెట్ల శ్రీనువాసరావు, నల్లా ఆదినారాయణ, పెయ్యిల శ్రీనివాస్, పల్లి చంద్రరావు, మోకా దుర్గారావు, నల్లా వీరభద్రం, వల్లూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌ను సత్కరించిన నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ పినిపే శ్రీకాంత్‌ను శుక్రవారం అమలాపురం పట్టణం వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు కలిశారు. అమలాపురం మండలం భట్నవిల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆర్డినేటర్ శ్రీకాంత్‌ను మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు, సంసానినాని, బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, అమలదాసు గోవింద్, చిత్రపు రామకృష్ణ,గోవ్వాల రాజేష్, కట్టోజు సన్నయిదాసు కలిసి సత్కరించారు.

మృతదేహం లభ్యం

యానాం: యానాం పట్టణ పరిధిలో పిల్లారాయ ఆలయం సమీపంలో వస్త్ర దుకాణం ఎదురుగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై కృపావరం తెలిపారు. మృతుడికి 45 సంవత్సరాలు ఉంటాయని కొంతకాలంగా పట్టణంలో యాచకుడిగా జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. అతడి మృతదేహాన్ని జీజీహెచ్‌లో మార్చురీకి తరలించినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు యానాం పోలీస్‌స్టేషన్‌లోని 0884-2321233 ఫోన్ నంబరుకి తెలియజేయాలని ఆయన కోరారు.

కీ బోర్డు సంగీతంలో గిన్నిస్ రికార్డు



గిన్నిస్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న టిను

అమలాపురం టౌన్: అమలాపురంలోని విద్యుత్ నగర్‌కు చెందిన 11 ఏళ్ల బాలుడు కాకర టినుకీ బోర్డు వాయించడంలో దిట్ట. హైదరాబాద్‌లోని హల్లెల్ మ్యూజిక్ స్కూల్లో గతేడాది డిసెంబరులో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కీ బోర్డు ఈవెంట్‌లో టినుప్రతిభ చాటాడు. 8 దేశాలకు చెందిన 1,046 మంది వాయిద్య కళాకారులు కీ బోర్డుపై ఒకేసారి గంట సమయంలో ఆన్‌లైన్ ద్వారా నాన్ స్టాప్‌గా ఆ మ్యూజిక్ స్కూలు ఎంపిక చేసిన స్వరాలను వాయించారు. తర్వాత తన కీ బోర్డుతో నాన్ స్టాప్ వాయిద్యం వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో టినుఅప్‌లోడు చేశాడు. టినుప్రతిభను గుర్తించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆ రికార్డ్స్‌కు ఆ బాలుడిని ఎంపిక చేసింది. ఇటీవల హైదరాబాద్ మణికొండలో నిర్వహించిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతనిధులు, హల్లెల్ మ్యూజిక్ స్కూలు వ్యవస్థాపకుడు బ్రదర్ అగస్టీన్ చేతుల మీదుగా టినుగిన్నిస్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. కాకర జగన్‌మూర్తి, సుమలత దంపతుల పెద్ద కుమారుడైన టినుఅమలాపురం సమీపంలోని పేరూరు వై జంక్షన్ వద్ద గల ప్రైవేటు స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. టినుగిన్నిస్ రికార్డ్స్ సాధించడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు జగన్‌మూర్తి, సుమలత అన్నారు.

మత్స్యకార భరోసా లబ్ధిదారుల గుర్తింపు సర్వే



బలుసుతిప్పలో బోటుపై మత్స్యకార భరోసా లబ్ధిదారుల గుర్తింపు ఫొటో తీస్తున్న అధికారులు

కాట్రేనికోన: చేపల వేట నిషేధ సమయంలో నష్టపోయిన లబ్ధిదారులను గుర్తింపు సర్వేను మత్స్యశాఖ ఆధ్వర్యంలో బలుసుతిప్ప, కొత్తపాలెం కేంద్రాలుగా భారీ ఎత్తున చేపట్టింది. మత్స్యశాఖ చేపట్టిన మత్స్యకార భరోసా పథకం లబ్ధిదారుల గుర్తింపు సర్వే ప్రక్రియకు బోటు యాజమానులు, కళాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చేపలు ప్రత్యుత్పత్తి సమయం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు పాటు చేపల వేటను నిషేధించిన ప్రభుత్వం నష్టపరిహారంగా రూ.20 వేలు చెల్లిస్తుంది. ఇంజన్ బోటుపై ఆరుగురు, మెకానైజ్డ్ బోట్లపై 8 మందికి మత్స్యకార భరోసా వర్తిస్తుంది. మండలంలో బలుసుతిప్ప 469, మగసానితిప్ప 37, గొల్లగరువు 17, కొత్తపాలెం 95, మొల్లేటిమొగ 80, పోర 55, పల్లం 60, రాజానగరం 4, చిర్రయానం 8, గచ్చకాయలపోర 3, నాగపట్టణం 2 కలిపి మొత్తం 834 బోట్లకు సంబంధించి 5,006 మంది లబ్ధిదారులుగా గుర్తించారు. జిల్లా మత్స్యశాఖ జేడీ శ్రీనివాస్ పర్యవేక్షణలో మత్స్యశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి లబ్ధిదారులను ఫొటోలను తీసారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



ఉప్పలగుప్తంలో సిలువను మోస్తున్న పాస్టర్ జయరాజు

ఉప్పలగుప్తం: క్రీస్తు మార్గం అనుసరణీయమని ఆర్సీఎం ప్రార్థనా మందిరం పాస్టరు పినిపే జయరాజు అన్నారు. ఉప్పలగుప్తం గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని క్రైస్తవ విశ్వాసులతో కలసి సిలువ మార్గం నిర్వహించారు.అనంతరం విశ్వాసులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రంగాపురంలో..

అమలాపురం రూరల్: రంగాపురం సీయోను ప్రార్థన మందిరం (ఐపీసీ) చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి నిర్వాహకుడు పాస్టర్ స్వర్ణన్ రాజు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: క్రీస్తుజ్యోతి కేథలిక్ దేవాలయం కొమరిగిరి ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ క్రీస్తురాజు ఆధ్వర్యంలో విశ్వాసులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కొమరిగిరి గట్టువారిపేట నుంచి మురమళ్ల వరకు సిలువ చేతబట్టి క్రైస్తవులు సిలువ మార్గం నిర్వహించారు.రెవరెండ్ ఫాదర్ అంతోని క్రీస్తురాజు, మహిళలు పాల్గొన్నారు.

యానాంలో సిలువ యాత్ర

యానాం: ఏసుక్రీస్తుకు శిలువ వేసిన రోజైన గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గ పరిధిలో పలు చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పురాతన యానాం రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో సిలువ మార్గ యాత్రలో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. మెట్టకూరు మదర్ సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో డాక్టర్ శ్రావ్య గుడ్‌ఫ్రైడే సందేశం ఇచ్చారు.

విశ్రాంత డీఈఈపై దాడి

అమలాపురం టౌన్: పట్టణంలోని గారపాటికి వీధికి చెందిన విశ్రాంత ఆర్అండ్‌బీ డీఈఈ యేడిద సూర్యప్రకాశరావుపై కాకినాడకు చెందిన బసవా ఆదినారాయణమూర్తి దాడి చేసి గాయపరిచాడు. విశ్రాంత డీఈఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదినారాయణమూర్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం సూర్యప్రకాశరావు ఈనెల 16న స్థానిక కూచిమంచి అగ్రహారంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికి వచ్చారు. బ్యాంక్ పనిపై వచ్చిన సూర్యప్రకాశరావు, ఆదినారాయణమూర్తి క్యూలైన్ విషయంపై ఇద్దరి మధ్య వివాదం తలెత్తిందింది. దీంతో బ్యాంక్ నుంచి బయటకు వస్తున్న సమయంలో ఆదినారాయణమూర్తి చేతులతో దాడి చేసి గాయపరిచారని సూర్యప్రకాశరావు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అప్రమత్తతో అగ్నిప్రమాదాల నివారణ



అమలాపురంలోని ఓ పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమలాపురం టౌన్: పెట్రోల్ బంకుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలపై యాజమాన్యాలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పెట్రోలు బంక్‌ల వద్ద అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం అవగాహన ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక దళాధికారి మురళీ కొండబాబు మాట్లాడుతూ బంకుల సిబ్బందికి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. లీడ్ ఫైర్ మెన్ మట్టపర్తి బలరామ్, సిబ్బంది డి.నూకరాజు, ఆర్.క్రాంతికుమార్ అగ్ని ప్రమాదాల నియంత్రణపై పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్ల సిబ్బందిని అప్రమత్తం చేశారు.

జగ్గిరెడ్డిని కలసిన శ్రీకాంత్



జగ్గిరెడ్డిని అభినందిస్తున్న శ్రీకాంత్ తదితరులు

రావులపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనను శుక్రవారం అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్, అలాగే అమలాపురం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గోపాలపురంలోని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగృహానికి చేరుకుని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

జగ్గిరెడ్డిని కలిసిన నల్లా

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని కాట్రేనికోన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వలసదారులకు రిజర్వేషన్లు వర్తింపజేయాలి

యానాం: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇస్తున్న 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వలసవచ్చిన ఎస్సీ, ఓబీసీలకు వర్తింపజేయాలని కోరుతూ ప్రధాని కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రిజర్వేషన్లలో నష్టపోయే జాబితాలో ఓబీసీలో ఓబీసీ, బీసీఎం, ఎంబీసీ, ఈబీసీ, బీటీ వర్గాలున్నాయని చెప్పారు. ఓబీసీలో శెట్టిబలిజ, పద్మశాలీ, దేవాంగులు, కంసాలి, కుమ్మరి, యాదవ, కళింతులు, గ్రామణి, నాడార్, క్రిస్టియన్ మైనారిటీలు, ఎంబీసీలో అగ్నికుల క్షత్రియులు, నాయీ బ్రాహ్మణ, రజక, కుమ్మరి మేదగిరి తదితరులు, ఎరుకలు ఉన్నారన్నారు. వీరు మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి విద్యాకోర్సులు, ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

అన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు శుక్రవారం ఓ భక్తుడు విరాళం అందించారు. కరీంనగర్‌కి చెందిన చిగురు కొమురయ్య లక్ష్మి దంపతులు రూ.10,116 వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు ఆలయ పర్యవేక్షణ అధికారికి శ్రీనివాసరాజు సమక్షంలో విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు.

ఎస్సైకి సత్కారం

యానాం: నూతన ఎస్సైగా యానాం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన పునీత్‌రాజును శుక్రవారం దరియాలతిప్ప గ్రామస్తులు దుశ్శాలువాతో సత్కరించారు. రాత్రివేళల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ఈ సందర్భంగా ఫిర్యాదు చేశారు. మందుబాబులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఆకతాయిల బైక్‌రేస్‌లు మితిమీరాయన్నారు.

అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలి

అమలాపురం రూరల్: అంతర్జాతీయ మార్కెట్‌ని అనుసరించి ధర ఇవ్వాలని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌ను కోకో రైతులు కోరారు. ఈ మేరకు కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఉప్పుగంటి భాస్కరరావు, కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, బీకేఎస్ జిల్లా ప్రతినిధులు సూర్యనారాయణ రాజు, అడబాల రాజమోహన్, ప్రకాష్, పలువురు రైతులు శుక్రవారం అమలాపురంలో ఎంపీని కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. కేంద్రం దృష్టికి తీసుకెళ్లి కోకో రైతులకు లాభసాటి ధర కల్పించాలని కోరారు.

కూటమి పాలనలో కరెంట్ కష్టాలు

అమలాపురం టౌన్: విద్యుత్ టవర్ ఈదురు గాలులకు పడిపోయిందన్న కారణంతో దానికి మరమ్మతుల పేరుతో మూడు రోజులపాటు విద్యుత్ సరఫరా అంతరాయంతో కోనసీమ ప్రజలను ఇబ్బంది పెట్టడంపై ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ టవర్ పాడైనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో సరఫరాను పునరుద్ధరించాలే తప్ప ఇలా ప్రజలను కరెంట్ కష్టాలకు గురి చేయకూడదని ఆయన శశుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఓ పక్క కరెంట్ బిల్లులను 50 శాతం పెంచేసి బిల్లుల రూపంలో ప్రజలను బాదేస్తుంటే ఇప్పుడు మూడు రోజుల పాటు సరఫరాలో అంతరాయంతో అవస్థలకు ఎవరు బాధ్యులని ఆయన ప్రశ్నించారు.

నీటి సమస్య పరిష్కారం

తాళ్లరేవు: మండల పరిధిలోని మత్స్యకార గ్రామాలకు నీటి ఎద్దడి కలుగకుండా చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుకీర్తి తెలిపారు. తాళ్లరేవు-2 పథకంలో భాగంగా కోరంగి పంచాయతీ పరిధిలోని గ్రామాల మంచినీటి చెరువుకు డీజిల్ జనరేటర్లను అమర్చినట్టు ఆయన తెలిపారు.